సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం ׀ 6 ׀ సెప్టెంబర్ ׀ 2023



ఉపాధ్యాయులకు సన్మానం

జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారిని మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ సన్మానించారు. 8లో▸

న్యూస్‌రీల్

గొర్రెల పెంపకందారుల సంఘం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట: జిల్లాలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని యాదవసంఘం నాయకులు మంగళవారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు 189 గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు ఉన్నాయని, 1,752 డీడీలు వచ్చాయని ఇంకా 4,628 డీడీలు కట్టాల్సి ఉందన్నారు. గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల్లోని సభ్యులకు గుర్తింపుకార్డులు ఇస్తామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన సంఘాలకు కార్యవర్గాలను ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీని వేగవంతం చేయాలని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న గొర్రెల పెంపకందారుల సహకార సంఘాన్ని సిరిసిల్లకు మార్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాసం మల్లేశం, ఒగ్గు బాల్‌రాజ్, బత్తుల మహేందర్, అంబటి చందు, కుమార్ తదితరులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 394, బ్రెస్ట్ 390, ఓరల్ కావిటీ 390 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 7, ల్యాబ్ 33, థైరాయిడ్ 24, విటమిన్ డీ 22, సీబీపీ 28, సూక్ష్మ పోషకాలు 35 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో ఇద్దరిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలలకు కోడెలు అందజేత



కోడెలను అందజేస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రాజన్న గోశాలలోని కోడెలను మంగళవారం గోశాలలకు అందజేశారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధర్మపురం గ్రామానికి చెందిన శ్రీభద్రకాళి గోశాలకు 10 ఆవులు, హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వనమాలకనపర్తి గ్రామానికి చెందిన జైదుర్గ గోశాలకు 20 కోడెలను అందజేశారు. ఆలయ అధికారులు శంకర్, నరసింహామూర్తి, శ్యామ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సింహం, ఏనుగులే ప్రత్యామ్నాయం!



- రాబోయే ఎన్నికలపై ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ గంపెడాశలు
- మళ్లీ సత్తా చాటేందుకు ఏఐఎఫ్‌బీ ఉత్సాహం
- స్థానిక సంస్థల్లో సింహం గుర్తుపై 24 మంది విజయం
- 2018లో రామగుండంలో ఎమ్మెల్యే సీటు కైవసం
- ఉమ్మడి జిల్లాలో బోణీ కొట్టేందుకు బీఎస్పీ ఆరాటం
- రెండుపార్టీలతో టచ్‌లో ఉంటున్న అసంతృప్తులు
- బీజేపీ, కాంగ్రెస్ జాబితాల తర్వాత మరికొంత మంది వస్తారని అంచనా



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. గులాబీ పార్టీ ఇప్పటికే తన అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ జాబితాపై కసరత్తు ప్రారంభించింది. బీజేపీ కూడా ఎమ్మెల్యే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. ఈ నెలాఖరు వరకు కాంగ్రెస్, బీజేపీల జాబితాపై స్పష్టత రానుంది. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు అసంతృప్తులు ఎలాగైనా ఎమ్మెల్యే బరిలో నిలిచేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు త్వరలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా జాబితా వెల్లడయ్యాక.. అసంతృప్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీరంతా తమ పార్టీ, అధికార పార్టీ కాకుండా మరో ప్రత్యామ్నాయ వేదిక నుంచి పోటీ చేసేందుకు సై అంటారనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో వీరికి రాజకీయంగా రెండు వేదికలు అందుబాటులో ఉంటాయి. అవి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) కాగా, బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ). ఈ రెండు పార్టీలు జిల్లాలో చాలాకాలంగా తమ ఉనికి చాటుకుంటున్నాయి. రెండు పార్టీలకు బలమైన క్రియాశీలక నేతలు లేకపోయినా, అసంతృప్తులను అప్పటికపుడు అక్కున చేర్చుకునే రాజకీయ వేదికలుగా మారాయి.

సెంటిమెంట్‌కు మారుపేరుగా..

ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) గతంలో ఎన్నికల సమయంలో మాత్రమే తెరపైకి వచ్చేది. కానీ, 2018లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) గుర్తు సింహం సింబల్‌పై గెలుపొందడంతో ఈ పార్టీ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. అప్పట్లో కోరుకంటి చందర్ విజయం ఒక సంచలనం. చందర్ గెలిచిన తరువాత ఉమ్మడి జిల్లాలో సింహం గుర్తు సానుభూతికి మారుపేరుగా మారిపోయింది.

భంగపడ్డ వారంతా..

అధికార - ప్రతిపక్ష పార్టీలో టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా క్రమంగా ఏఐఎఫ్‌బీలో చేరడం, సింహం గుర్తుపై పోటీ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ పార్టీగుర్తుపై పోటీ చేసిన వారిలో విజయశాతం కూడా బాగుండటం అసంతృప్తులు పార్టీని ఎంచుకోవడానికి ఒక కారణంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇదేదారిలో పయనించిన 24 మంది రాజకీయ నేతలు స్థానిక సంస్థల్లో విజయం సాధించి సింహం గుర్తుతో తమ సత్తా చాటుకున్నారు. అయితే, వీరంతా తరువాత అధికార పార్టీకి చేరువవుతండటం గమనార్హం. ప్రస్తుతం రామగుండంలో కందుల సంధ్యారాణి, పెద్దపల్లిలో నల్ల మనోహర్‌రెడ్డి సింహం గుర్తుపై పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని సమాచారం. వీరే కాక ఉమ్మడి జిల్లాలో పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్, బీజేపీ అసంతృప్తులు సైతం బీఎస్పీతోనూ టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

60 అసెంబ్లీ స్థానాల్లో పోటీ



క్రితంసారి రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 188 మంది మా పార్టీ నుంచి పోటీ చేయగా.. 92 మంది విజయం సాధించారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలు, రాష్ట్రవ్యాప్తంగా 60 స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఏఐఎఫ్‌బీ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భావజాలానికి, ఆయన సిద్ధాంతాలను అభిమానించే వారు, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకత ఉన్న వారు మా పార్టీని తప్పకుండా ఆదరిస్తారు.

– జోజిరెడ్డి, ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏఐఎఫ్‌బీ గెలిచిన సీటు ఇదే..

రామగుండం అసెంబ్లీ: ఎమ్మెల్యే (తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు)

స్థానికసంస్థల్లో ఇలా..:

- కరీంనగర్ కార్పొరేషన్‌లో 12 పోటీ మంది చేస్తే 3 సీట్లు దక్కించుకున్నారు. దాదాపుగా 12,700 ఓట్లు సాధించారు. అదేసమయంలో కాంగ్రెస్ 50 స్థానాల్లో పోటీ చేయగా.. 9,000కుపైగా ఓట్లు రావడం గమనార్హం.
- రామగుండంలో 14 స్థానాల్లో పోటీ చేయగా.. 9 మంది కార్పొరేటర్లు విజయం సాధించడం ఇక్కడ సింహం సింబల్‌కు ఉన్న ఆదరణకు నిదర్శనం.
- చొప్పదండిలో ఎంపీటీసీ స్థానం, పెద్దపల్లి 5 ఎంపీటీసీలు, మానకొండూరులో ఒకటి, రాయికల్‌లో ఒకటి, రామగుండంలో ఎంపీటీసీ మొత్తానికి 9 ఎంపీటీసీ స్థానాల్లో సింహం విజయం సాధించింది.
- చొప్పదండి మున్సిపల్‌లో ఒక కౌన్సిలర్, జగిత్యాలలో ఒక కౌన్సిలర్, పెద్దపల్లిలో ఒక కౌన్సిలర్ చొప్పున ముగ్గురు గెలిచారు.

బోణీ కోసం బీఎస్పీ తహతహ..

- 2004లో, 2014లో బీఎస్పీ తెలంగాణలో మంచి ప్రభావమే చూపింది. 2014లో రెండు అసెంబ్లీ స్థానాలు గెలిచి, తరువాత ఆ స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. 2004లో కరీంనగర్ పార్లమెంటు నుంచి పోటీ చేసిన అభ్యర్థికి 43వేల ఓట్లు వచ్చాయి. 2006లో కోనరావుపేటలో ఐదు ఎంపీటీసీలు, సుల్తానాబాద్‌లో రెండు ఎంపీటీసీలు గెలుచుకుంది.
- 2021లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీ మునపటి కన్నా ఆర్థికంగా బలపడిందన్న ధీమా కేడర్‌లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్దపల్లి అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష(ఐఐటీ- ఖరగ్‌పూర్) పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉంటూ, విజయంపై ధీమాగా ఉన్నారు. మిగిలిన స్థానాల్లోనూ నిశ్శబ్ద ఫలితాలు ఉంటాయని, ఆర్‌ఎస్పీ నాయకత్వం, ఆయనకు జిల్లాతో ఉన్న అనుబంధం కలిసి వస్తుందని నాయకులు ధీమాగా ఉన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇతర పార్టీల నుంచి అభ్యర్థులు వచ్చినా.. తమ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉంటేనే టికెట్ ఇస్తామని స్పష్టంచేస్తున్నారు.



'సప్త' సోయగం



గంభీరావుపేట(సిరిసిల్ల): సముద్రలింగాపూర్‌లోని సింగసముద్రం మత్తళ్లు దూకుతోంది. ఈ చెరువుకు ఏడు మత్తళ్లు ఉన్నాయి. ఒకేసారి సప్త మత్తళ్లు పొంగిపొర్లడంతో జల సోయగం కనువిందు చేస్తోంది. మత్తళ్లు ఉధృతంగా దూకుతుండడంతో పర్యాటకులను పోలీసులు అనుమతించడం లేదు.

మూడు షిఫ్టుల్లో పనులు చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



కాలేజీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల: సిరిసిల్ల మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను మూడు షిఫ్టుల్లో చేసి 9 రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణ శివారులోని పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీ భవనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెడికల్ కాలేజీ త్వరలో ప్రారంభం కావాల్సి ఉందని, ఇందు కోసం నిర్మాణ కార్మికుల సంఖ్యను పెంచుకుని 9 రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిలో ఉన్న పనులు పూర్తిచేయాలి

సిరిసిల్ల: జిల్లాలో ప్రగతిలో ఉన్న రోడ్లు, భవనాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లతో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. వేములవాడ వీటీడీఏ పరిధిలో రూ.9.95 కోట్లతో చేపట్టిన వేములవాడ-వట్టెంల రోడ్డు విస్తరణ, వేములవాడ-కోరుట్ల నాలుగు వరసల రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో 1.6 కిలో మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం, ఇండ్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, మిషన్ భగీరథ పైపులైన్ షిఫ్టింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల- ముస్తాబాద్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, అటవీ శాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు. రగుడు-వెంకటాపూర్ బైపాస్ రోడ్డు, రూ.2.20 కోట్లతో నిర్మించే అతిథి గృహ నిర్మాణ టెండర్లు పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్, వీటీడీఏ కార్యదర్శి యెల్లండి సమ్మయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్ సుందర్, డీపీవో రవీందర్, మిషన్ భగీరథ ఈఈ జానకి, 'సెస్' ఎండీ సూర్యచంద్రరావు, వీర్నపల్లి తహసీల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు స్వీకరించిన ఉత్తమ ఉపాధ్యాయులు







మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న, భాగ్యరేఖ, ప్రవీణ్, శ్రీదేవి

సిరిసిల్లఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఏటా ప్రభుత్వం అందించే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు సిరిసిల్ల బాలికల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నాగుల భాగ్యరేఖ ఎంపికైంది. అలాగే వీర్నపల్లి మండలం రంగంపేట పాఠశాల ఉపాధ్యాయుడు కొత్వాల్ ప్రవీణ్ సైతం ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహ్మద్‌అలీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా భాగ్యరేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ, చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, మళ్లీ కొన్నాళ్లకు ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసే అవకాశం రావడం గొప్ప అదృష్టమన్నారు. ఈ అవార్డు మరింత ఉత్సాహంగా పని చేయడానికి, బాధ్యతాయుతంగా ముందుకెళ్లడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు బోధన చేస్తూ తనకు సహకరించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. మారుమూల ప్రాంతంలో పని చేస్తున్న తన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందని ఉపాధ్యాయుడు ప్రవీణ్ తెలిపారు.

అవార్డు స్వీకరించిన పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ శాఖ అధిపతి పి.శ్రీదేవి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా స్వీకరించారు. ఈసందర్భంగా శ్రీదేవికి కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్, రవికుమార్, ప్రభాకరచారి, కృష్ణమనోహర్, సంధ్యారాణి, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

అదే జోరు.. ఊరూ.. వాడా నీరు

జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు..(మిల్లీ మీటర్లలో)

రుద్రంగి	56.3
చందుర్తి	83.9
వేములవాడరూరల్	84.5
బోయినపల్లి	72.3
వేములవాడ	126.6
సిరిసిల్ల	97.6
కోనరావుపేట	81.7
వీర్నపల్లి	53.5
ఎల్లారెడ్డిపేట	73.0
గంభీరావుపేట	44.0
ముస్తాబాద్	73.4
తంగళ్లపల్లి	118.5
ఇల్లంతకుంట	86.2



వరద నీటిలో ఆటోనగర్- శాంతినగర్ రోడ్డు

- మూడో రోజు వీడని వాన
- మానేరు.. మూలవాగు పరవళ్లు

సిరిసిల్ల: జిల్లాలో మూడో రోజు మంగళవారం వర్షం జోరు తగ్గలేదు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు మత్తడి దూకుతోంది. నక్కవాగు, గంజివాగులతో కలిసి మానేరు వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయం మత్తడి ఉగ్రరూపం దాల్చింది. వేములవాడ మూలవాగు నిండుగా పారుతోంది. హన్మాజీపేట నక్కవాగులో వరద ప్రవాహం ఎక్కువై రాకపోకలకు విఘాతం కలిగింది. మూలవాగు వెంబడి వట్టిమల్ల, బావుసాయిపేట-వెంకట్రావుపేట, మామిడిపల్లి-నిజామాబాద్ మధ్య నిర్మించిన తాత్కాలిక మట్టి కాజ్‌వేలు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి.

లోతట్టు ప్రాంతాలు జలమయం

జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్, అనంతనగర్, శ్రీనగర్ కాలనీ, ఆసిఫ్‌పురా వరదతో నిండిపోయాయి. ఇళ్లలోకి, మరమగ్గాల కార్ఖానాల్లోకి వరద చేరింది. వస్త్రోత్పత్తికి విఘాతం ఏర్పడింది. ఉదయం పూట జోరు వానతో జనజీవనం స్తంభించింది. వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

జిల్లా అంతటా ఎక్కువ వర్షపాతం..

జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి సగటు వర్షపాతం 80.9 మి.మీ పడగా.. గతేడాది ఈ రోజు వరకు 892.7 మి.మీ వర్షం పడింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 931.3 మి.మీ పడింది. జిల్లా సగటు సాదారణ వర్షపాతం 588.9 మి.మీ ఉంది. వేములవాడ రూరల్ మండలం మినహా అన్ని మండలాల్లో ఎక్కువ వర్షం కురిసింది.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జలాశయాలు, లో లెవల్ వంతెనల వద్ద రే యింబవళ్లు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు.

నిలిచిన రాకపోకలు

వేములవాడఅర్బన్: భారీ వర్షాలకు బోయినపల్లి మండలంలోని కొదురుపాక- బోయినపల్లి, కొదురుపాక-బూరుగుపల్లి, కొదురుపాక- వేములవాడ రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి.

వేములవాడ వయా నూకలమర్రి

వేములవాడరూరల్: వేములవాడకు వచ్చే పలు ప్రధాన రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల నుంచి వచ్చే వాహనదారులు నూకలమర్రి మీదుగా చేరుకుంటున్నారు. కోరుట్ల నుంచి వచ్చే భక్తులు మర్రిపల్లి వద్ద నీటి ప్రవాహంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని బొల్లారం, లింగంపల్లి గ్రామాల మధ్య చెక్‌డ్యాం ఎత్తు పెరగడంతో పైనుంచి వచ్చే నీరు బొల్లారంలోకి ప్రవేశించింది. దీంతో వాగు పక్కన ఉన్న గృహాలను ఖాళీ చేయించారు. చెక్‌డ్యాం కొంత భాగాన్ని బ్లాస్ట్ చేసేందుకు అధికారులు రెండు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

మూడపల్లిలో కూలిన ఇల్లు

చందుర్తి(వేములవాడ): వర్షం ధాటికి మండలంలోని మూడపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇటిక్యాల లస్మవ్వ ఇల్లు మంగళవారం కూలిపోయింది. కట్టలింగంపేటలో ఆర్‌అండ్‌బీ రోడ్డు, బండపల్లి- బావుసాయిపేట గ్రామాల మధ్య లోలెవల్ వంతెన రోడ్డు కోతకు గురయ్యాయి.



శాంతినగర్- మెహర్‌నగర్ రోడ్డుపై వరద నీరు



శాంతినగర్‌లోని కార్ఖానాలో చేరిన నీరు



కలెక్టరేట్ నుంచి సిరిసిల్లకు వెళ్లే ప్రధాన రహదారి డివైడర్‌పై వరద ప్రవాహం



అంబేడ్కర్‌నగర్- శాంతినగర్ రోడ్డుపై వరదనీరు



కోతకు గురైన బండపల్లి- బావుసాయిపేట రోడ్డు



కూలిన ఇంటి వద్ద వృద్ధురాలు



చెక్‌డ్యాం భాగాన్ని బ్లాస్ట్ చేస్తున్న అధికారులు

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ



రేవంత్‌రెడ్డితో నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూర్‌): మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్యతో పాటు జవారిపేట సర్పంచ్‌ అన్నాడీ కరుణ, రేపాక, పెద్దలింగాపూర్‌ ఎంపీటీసీలు కథ సుమలత, కరివేద స్వప్నతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు మానకొండూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, పసుల వెంకటి, తదితరులున్నారు.

రాజీయే రాచమార్గం



మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్‌

ముస్తాబాద్‌(సిరిసిల్ల): రాజీ మార్గమే రాచమార్గమని సిరిసిల్ల రూరల్‌ సీఐ సదన్‌కుమార్‌ అన్నారు. ముస్తాబాద్‌ యాదవ ఫంక్షన్‌ హాల్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల కక్షిదారులతో ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ మంగళవారం కౌన్సెలింగ్‌ నిర్వహించింది. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ, కక్షలు, పగలతో, క్షణికావేశంలో జరిగిన ఘటనలపై అనేక కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. ఎంతో మంది కోర్టుల చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో లోక్‌ అదాలత్‌ ద్వారా సత్వర న్యాయానికి అవకాశం ఉందన్నారు. ఇరువర్గాల అంగీకారంతో రాజీ పడవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు కేసులలో కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారితో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌సీ భూమయ్య, పీసీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల బంగారం చోరీ



చిందరవందరగా పడిఉన్న వస్తువులు

వేములవాడ: రాజన్న దర్శనానికి ఆదివారం రాత్రి వేములవాడకు వచ్చిన వరంగల్‌ జిల్లా నర్సంపేటకు చెందిన పద్మజ కుటుంబం రామందిర్‌వీధిలోని ఓ ప్రైవేట్‌ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం బద్దిపోచమ్మ బోనం మొక్కులు చెల్లించుకునేందుకు గదికి తాళం వేసి వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి గది తాళం తీసి సామగ్రి సంచులు చిందరవందరగా పడి ఉన్నాయి. అరతులం బంగారం, రెండు మొబైల్‌ ఫోన్లు, రూ.6 వేల నగదు చోరీకి గురైనట్లు లాడ్జి నిర్వాహకులను సంప్రదించగా, తమకు సంబంధం లేదని సమాధానం చెప్పారని బాధితులు వాపోయారు. లాడ్జి నిర్వాహకులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లాడ్జిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌ సీఐ కరుణాకర్‌ తెలిపారు.

నకిలీ ఏజెంట్ల ఆగడాలెన్నో!



రోదిస్తున్న వాసాల నరేశ్‌ భార్యాపిల్లలు (ఫైల్‌)

“ఈ ఫొటోలో రోదిస్తూ కనిపిస్తున్నది రుద్రంగికి చెందిన వాసాల నరేశ్‌ భార్యాపిల్లలు. ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్‌ వెళ్లాలనుకున్నాడు. రూ.1.50 లక్షలు అప్పు చేసి, వీసా కోసం స్థానిక ఓ ఏజెంట్‌కు చెల్లించాడు. నకిలీ వీసా ఇవ్వడంతో ఎయిర్‌పోర్టు వరకు వెళ్లి, తిరిగొచ్చాడు. నిలదీస్తే ఏజెంట్‌ చేతులెత్తేయడంతో అప్పు తీర్చే, కుటుంబాన్ని పోషించే దారి లేక ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో నరేశ్‌ అమ్మానాన్న, భార్య లత, ఇద్దరు కూతుళ్లు రోడ్డున పడ్డారు.



నరేశ్‌ (ఫైల్‌)



ఈ యువకుడు దేశవేని గంగాధర్‌. రుద్రంగికి చెందిన ఇతను స్థానికంగా ఉండే ఓ ఏజెంట్‌ వద్ద దుబాయ్‌కి వీసా తీసుకున్నాడు. ఇందుకు రూ.2 లక్షలు చెల్లించాడు. దుబాయ్‌లో రెండేళ్ల జీతం ఇవ్వకున్నా పనిచేశాడు. వీసా గడువు పూర్తికాగానే ఏజెంట్‌ మళ్లీ రూ.2 లక్షలు అడిగాడు. గత్యంతరం లేక గంగాధర్‌ అప్పు చేసి ఇచ్చాడు. డబ్బులు తీసుకొని కూడా వీసా ఇవ్వకపోవడంతో దుబాయ్‌ పోలీసులు గంగాధర్‌ను జైలులో వేశారు. నీ వల్లే జైలుపాలయ్యానని, తనను విడిపించాలని నకిలీ ఏజెంట్‌ను కోరగా రూ.3.50 లక్షలు కావాలన్నాడు. ఆ డబ్బులు సైతం తీసుకొని, పత్తా లేకుండా పోయాడు. మోసపోయానని గ్రహించిన గంగాధర్‌ జైలులో ఉన్న ప్రవాసీ భారతీయుల సహకారంతో కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా రూ.3.50 లక్షలు పంపించి, జైలు నుంచి విడిపించారు. ఏజెంట్‌ మోసానికి రూ.15 లక్షలు నష్టపోయాయనని, ఊరిలో పనిలేక, కుటుంబాన్ని పోషించుకునే మార్గం లేక ఇబ్బంది పడుతున్నానని గంగాధర్‌ తెలిపాడు. ఇల్లు శిథిలావస్థకు చేరి, కూలిపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నానని కన్నీరు పెట్టుకుంటున్నాడు.

‘రుద్రంగికి చెందిన మరో నకిలీ ఏజెంట్‌ గల్ఫ్‌ దేశాల్లో కార్డులు ఇప్పిస్తానని రుద్రంగి, మానాల, కోరుట్ల, చుట్టుపక్కల గ్రామాల ప్రవాస భారతీయులు 30 మంది దగ్గర సుమారు రూ.80 లక్షల వరకు వసూలు చేశాడు. తర్వాత గల్ఫ్‌ నుంచి రుద్రంగికి మకాం మార్చాడు. మోసపోయిన బాధితులు పలుమార్లు అతని ఇంటి వద్దకు వచ్చి నిలదీసి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎలాంటి న్యాయం జరగకపోగా, కనీసం ఏజెంట్‌పై కేసు నమోదు కాలేదు.’ ”

- మోసపోయి రోడ్డున పడుతున్న బాధితులు
- ఏజెంట్లకు రాజకీయ నాయకుల అండ

రుద్రంగి(వేములవాడ): జిల్లాలో గల్ఫ్‌ నకిలీ ఏజెంట్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఉన్న ఊరిలో ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్న అమాయకులకు మాయమాటలు చెప్పి అందినకాడికి వసూలు చేసి మోసం చేస్తున్నారు. వారిని అప్పుల ఊబిలోకి నెట్టేసి, కుటుంబాలు రోడ్డున పడేలా చేస్తున్నారు. బాధితులు అప్పులు తీర్చే మార్గం, కుటుంబ పోషణకు ఏ పనీ లేక.. ఆత్మహత్యే శరణ్యమంటూ కుమిలిపోతున్నారు. ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకొని, ఏజెంట్ల మోసాలకు చెక్‌ పెట్టాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

విలాసవంతమైన జీవనం

అమాయకులను రూ.లక్షల్లో ముంచుతున్న గల్ఫ్‌ నకిలీ ఏజెంట్లు తెల్లదుస్తులు వేసుకొని, కారు, బంగ్లా వంటి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. పోలీసులు, బాధితులు ఏమీ అనకుండా రాజకీయపార్టీల్లో చేరి, నియోజకవర్గస్థాయి నాయకుల అండదండలతో యథేచ్ఛగా వారి దందాను కొనసాగిస్తున్నారు. పోలీసులను మచ్చిక చేసుకొని బాధితులనే బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పోలీసుల వద్దకు వెళ్లినా జరగని న్యాయం

పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగడం లేదని నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయినవారు వాపోతున్నారు. రాజకీయ నాయకులకు, పోలీసులకు వారి పాపంలో భాగం ఉంటోందని ఆరోపిస్తున్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టిసారించి, నకిలీ ఏజెంట్ల మోసాలకు చెక్‌పెట్టి, అమాయకులకు రక్షించాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

గల్ఫ్‌ నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయినవారు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాలనుకునేవారు లైసెన్స్‌ కలిగిన ఏజెంట్ల వద్ద గానీ, కంపెనీల్లో ఇంటర్వ్యూల ద్వారా గానీ వీసాలు తీసుకోవాలి.

– ఎస్సై రాజేశ్‌, రుద్రంగి

పవర్‌లూం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీవో గౌతంకు వినతిపత్రం ఇస్తున్న రమణ

సిరిసిల్లటౌన్‌: రాష్ట్రంలోని పవర్‌లూం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టెస్కో డీవో గౌతంను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని టెస్కో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. సర్కారు త్రిఫ్ట్‌ పథకాన్ని ప్రారంభించి ఏడాది గడుస్తుందన్నారు. ఆర్‌డీ–1 అకౌంట్‌లో ప్రతినెలా డబ్బులు కట్‌ అవుతున్నాయే తప్ప ఆర్‌డీ–2 అకౌంట్‌లో డబ్బులు జమ కావడం లేదన్నారు. యారన్‌ సబ్సిడీ రాని కార్మికులందరికీ వెంటనే డబ్బులు అందించాలని కోరారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్‌

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలో గంజాయి క్రయవిక్రయాలకు కొందరు ప్రణాళికలు చేస్తున్నట్లు వస్తున్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరిస్తూ నిఘా కఠినం చేశారు. దీనిలో భాగంగా రెండురోజుల క్రితం 120 గ్రాముల గంజాయిని రెడ్డిమల్ల శ్రీనివాస్‌ నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఇది మరువక ముందే మరో బ్యాచ్‌ గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు మంగళవారం గాలింపు చర్యలు చేపట్టారు. దీనిలో ఇద్దరు పట్టుబడినట్లు తెలిసింది. కాగా అసలు గంజాయి విక్రయించేవారు ఎవరన్న దానిపై మరింత లోతుగా దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం. ఈ విషయమై సిరిసిల్ల టౌన్‌ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా, గంజాయి సేవించే వాళ్లు పట్టుబడిన మాట వాస్తవమని కేసు దర్యాప్తులో ఉందన్నారు.

అందరివాడిని.. ఆశీర్వదించండి

- కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌

వేములవాడ: ‘నేను మీ అందరివాడిని, నా సేవలను గుర్తించి ఈసారి తప్పకుండా ఆశీర్వదించాలి’ అని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులను ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్‌ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్‌, ప్రధాన కార్యదర్శి మహేశ్‌, ఇతర కార్యవర్గ సభ్యులు, పాత్రికేయులు ఆయన్ని సన్మానించారు. అనంతరం ఆది శ్రీనివాస్‌ మాట్లాడుతూ, గతంలో జరిగిన నాలుగు ఎన్నికల్లో ఓటమి చవి చూశానని, అయినా అందరి ఆశీస్సుల కోసం ప్రజలతో మమేకమై ఉన్నానన్నారు. కరోనా కష్టకాలంలోనూ పాత్రికేయులతో సమానంగా ప్రజాసేవలో ఉన్నానని గుర్తు చేశారు. ఈసారి జరిగే ఎన్నికల్లో తప్పకుండా తనకు మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాగారం వెంకటస్వామి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి వికాసానికి గురువే మూలాధారం



సన్మానిస్తున్న సాహితీ సమితి బాధ్యులు

సిరిసిల్లకల్చరల్‌: వ్యక్తి వికాసానికి గురువు బోధనలే మూలాధారం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఆకునూరి శంకరయ్య అన్నారు. సిరిసిల్ల సాహితీ సమితి సారథ్యంలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో అతిథిగా హాజరై మాట్లాడారు. తాత్వికుడైన సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయుడిగా జీవన ప్రయాణం ప్రారంభించి అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించి ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయుడుగా నిలిచారన్నారు. సర్వేపల్లి ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు రేపటి తరాన్ని తీర్చి దిద్దేందుకు కృషి చేయాలన్నారు. అఖిల భారత రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం మాట్లాడుతూ, నిస్వార్థ ఉపాధ్యాయుల కారణంగా జాతి సగర్వంగా నిలబడుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కోడం నారాయణ, మిట్టపల్లి రాములు, వెంగల శ్రీనివాస్‌, లక్ష్మణ్‌, కొక్కుల రాజేశం, గజ్జెల్లి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్‌ సిటిజన్ల ఆధ్వర్యంలో..

ఆల్‌ సీనియర్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక వస్త్ర, వ్యాపార సంఘ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. రిటైర్డ్‌ టీచర్లు డాక్టర్‌ జనపాల శంకరయ్య, అంకారపు జ్ఞానోభలను సత్కరించారు. సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రతినిధులు ఏనుగుల ఎల్లయ్య, దొంత దేవదాస్‌, గౌరిశెట్టి ఆనందం, గాజుల జయరాం, ఇరుకుల్ల భాస్కర్‌, రాపెల్లి ముకుందం పాల్గొన్నారు.

మెడికల్‌ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట(వేములవాడ): మండలకేంద్రంలోని మోడల్‌ స్కూల్‌లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి సర్దాని రోహిణి మెడికల్‌ సీటు సాధించడంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన రోహిణి కోనరావుపేటలోని ఆదర్శ పాఠశాలలో చదివింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోహిణిని సన్మానించారు. ప్రిన్సిపాల్‌ కంకణాల సాగర్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసై.. చిత్తుగా తిరుగుతూ..

- పోలీసులకు పట్టుబడిన బాలుడు

సిరిసిల్లక్రైం: ఇంటిలో పెద్దల పర్యవేక్షణ లోపంలో పెడదారిలో పయనిస్తూ మత్తుకు అలవాటు పడి ఇష్టారీతిగా వివిధ ప్రాంతాల్లో చిత్తుగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు మంగళవారం సిరిసిల్ల బస్టాండ్‌ ఏరియాలో పట్టుకున్నారు. సీఐ ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మంథని మండలం సిరిపురానికి చెందిన బాలుడు స్పిరిట్‌, సిగార్స్‌, బోనోఫిక్స్‌ లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డాడు. సిరిసిల్ల బస్టాండ్‌ఏరియాలో ఓ అనుమానిత బాలుడు ఏదో సేవిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడి వద్ద ఉన్న బోనోఫిక్స్‌ (టైర్ల పంక్చర్‌కు వాడే గమ్‌)ను స్వాధీనం చేసుకున్నారు. బాలుడి సంరక్షణార్థం బాలరక్ష భవన్‌ అధికారులను పిలిచి వివరాలను అడగ్గా, ఇంతకు ముందు ఇలాంటి మత్తుమందులు సేవించిన కేసులో బాలుడు దొరికినట్లు తెలిసింది. ప్రస్తుతం కౌన్సెలింగ్‌ నిర్వహించి, సత్ప్రవర్తన నిమిత్తం బాలసదన్‌కు అప్పగించాలని బాలరక్ష భవన్‌ అధికారులకు తెలిపినట్లు సీఐ ఉపేందర్‌ పేర్కొన్నారు.

కాలువలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన బ్లూకోల్ట్స్‌ సిబ్బంది



గంగమ్మను రక్షించిన పోలీసులు

మల్యాల(చొప్పదండి): అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ మహిళ వరద కాలువలో దూకగా బ్లూకోల్ట్స్‌ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన మెట్‌పల్లి గంగమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. మంగళవారం మల్యాల అడ్డరోడ్డు సమీపంలోని వరద కాలువ వద్దకు వచ్చి, అందులో దూకింది. స్థానికులు గమనించి, 100కు ఫోన్‌ చేయగా మల్యాల బ్లూకోల్ట్స్‌ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాలువలో దిగి, బాధితురాలిని ఒడ్డుకు చేర్చారు. అనంతరం 108 వాహనంలో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బ్లూకోల్ట్స్‌ సిబ్బంది ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్‌ భాస్కర్‌, కానిస్టేబుల్‌ సురేశ్‌, హోంగార్డు సంపత్‌, మహిళా కానిస్టేబుల్‌ జ్యోతిని సీఐ కోటేశ్వర్‌, ఎస్సై అశోక్‌ అభినందించారు.

సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులు

- జెడ్పీ చైర్‌పర్సన్‌ న్యాలకొండ అరుణ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ అరుణ

సిరిసిల్ల: పిల్లలకు తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు భవిష్యత్‌ను ప్రసాదిస్తారని జెడ్పీ చైర్‌పర్సన్‌ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా కలెక్టరేట్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 35 మంది టీచర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ, పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంతో టీచర్ల పాత్ర గొప్పదన్నారు. గురువు లేనిదే సమాజం లేదని, సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులన్నారు. సీఎం కేసీఆర్‌ విద్యారంగంలో అనేక మార్పులు తెచ్చారని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రం విద్యారంగంలో ముందుందని అన్నారు. అదనపు కలెక్టర్‌ ఎన్‌.ఖీమ్యానాయక్‌ మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేదన్నారు. చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరడం సాధ్యమవుతుందన్నారు. 35 మంది ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో అవార్డులు అందించి సత్కరించారు. వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జిల్లా విద్యాధికారి రమేశ్‌, డీపీఆర్వో ఎం.దశరథం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారానికి రెండురోజులు డ్రై డే పాటించాలి

- కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి



రాళ్లపేట గ్రామస్తులకు సూచనలిస్తున్న కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడితే దోమలను అరికట్టవచ్చని కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి అన్నారు. మంగళవారం మండలంలోని రాళ్లపేట గ్రామంలో జిల్లా అధికారులతో కలెక్టర్‌ పర్యటించి డ్రై డేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, ఏ ఇంట్లోనూ వర్షం, మంచి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఇంటింటా పరిసరాలను పరిశీలిస్తూ, నీటి నిల్వలను తొలగిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణ వాహనం రోజూ వస్తుందా, ఇంట్లో ఎవరికైనా చికెన్‌ గున్యా, డెంగీ జ్వరాలు వచ్చాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాలు డ్రై డే తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఉపయోగంలో లేని బావుల్లో ఆయిల్‌ బాల్స్‌ వేయాలన్నారు. ఎవరికైనా డెంగీ పాజిటివ్‌ వస్తే సంబంధిత పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను కలెక్టర్‌ తనిఖీ చేశారు. గ్రామంలోని పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రత్యేక చొరవ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నూతన వంటగది, టాయిలెట్‌ నిర్మాణానికి వెంటనే గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవో లచ్చాలును ఆదేశించారు. అదనపు కలెక్టర్‌ బి.సత్యప్రసాద్‌, ఆర్డీవో ఆనంద్‌కుమార్‌, డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుమన్‌మోహన్‌రావు, డీపీవో రవీందర్‌, సర్పంచ్‌ బాలుసాని పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

వరుస ధర్నాలు.. ఆందోళనలు



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం వర్కర్లు

సిరిసిల్లటౌన్‌: జిల్లా కేంద్రం సిరిసిల్లలో మంగళవారం ప్రభుత్వ తీరుపై నిరసనలు జోరుగా సాగాయి. ప్రజాసంఘాలు, కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులు ధర్నాలు చేపట్టారు.

చెవిలో పువ్వుతో ఎన్‌హెచ్‌ఎంల నిరసన

కొద్ది రోజులుగా నిరవధిక రిలేదీక్షలకు పూనుకున్న నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ స్కీం వర్కర్లు మంగళవారం చెవిలోపూలు పెట్టుకుని నిరసన తెలిపారు. తమ డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పి.రాణి, గిరిధర్‌, శ్వేత, ఫాజల్‌, ప్రవీన్‌, సునంద, పర్వీన్‌, వనిత, వెంకటేశ్‌, బాలకృష్ణ, లలితమ్మ, రాజమణి, శేఖర్‌, యూనియన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే తమ ఉద్యోగాలకు ప్రభుత్వం వెంటనే పర్మినెంట్‌ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్‌ ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌ చౌరస్తాలో ఆందోళన చేపట్టగా వక్తలు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్నారు. జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్‌, అబ్దుల్‌ కయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్‌, నీరజ, శ్రీనివాస్‌, సలీం, నరేష్‌, వెంకటస్వామి, ఉపేందర్‌ తదితరులున్నారు.

28వ రోజుకు మాజీ సర్పంచుల దీక్షలు

మాజీ సర్పంచుల దీక్షలు మంగళవారం 28వ రోజుకు చేరాయి. సమస్యను పరిష్కరించాల్సిన తాము ఇన్ని రోజులుగా రిలే దీక్షలను చేపడుతుంటే ప్రభుత్వం పట్టింపు లేకుండా ఉండటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్‌, అలువాల లక్ష్మన్‌, దేవుని నర్సయ్య, గోవర్దన్‌, సత్యనారాయణ రెడ్డి, పైలూరి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యాలయాలు









పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రాంగణాలు చిన్నపాటి జల్లులకు జలమయం అయిపోతుంది. కళాశాలలో పురాతన తరగతి గదులు కావడంతో స్లాబ్‌ పెచ్చులూడుతున్నాయి. విద్యార్థులు కూర్చొనే డెస్కులు సైతం క్షీణదశకు చేరుకున్నాయి. వరదనీరు వెళ్లడానికి సిబ్బంది చర్యలు చేపట్టారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగడానికి ముందే అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, రాజన్న సిరిసిల్ల